క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం

కోడుమూరు రూరల్ : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, సభ్యులు బుధవారం సాయంత్రం స్థానిక కొండపేట ప్రాథమిక పాఠశాలలో అభినందన సభ నిర్వహించి సన్మానించారు. నూతనంగా కోడుమూరు మండల విద్యాధికారి బాధ్యతలు స్వీకరించిన శరభయ్యతో పాటు, పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు శ్రీధర్, నరసింహులు, విక్టర్, శంకరప్ప, జనార్దన్, శ్రీరాములుకు నాయకులు పూలమాల వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం సభ్యులు శ్రీనివాసులు, దేవదాసు, వేణుగోపాల్, తిక్కన్న, హనుమంతు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కేవీఎస్ఆర్ ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలు పొందిన వారితో కళాశాల చైర్మన్ సుబ్బారెడ్డి

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో బుధవారం చెన్నైకు చెందిన వికేర్ (స్కిన్, హేర్ క్లినిక్) హెచ్ఆర్ కిరణ్‌కుమార్, సుశీల్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. విద్యార్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి మొత్తం 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరెస్పాండెంట్ విజయలక్ష్మమ్మ అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ కుసుమకుమారి, హరీష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కార్యాలయానికి నేమ్ బోర్డు ఏదీ?



ఊరు, పేరు సూచించే బోర్డు లేని మునగాలపాడు సచివాలయం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు అర్బన్ పరిధిలోని 38వ వార్డు మునగాలపాడులో సచివాలయానికి ఊరు, పేరు బోర్డు ఎక్కడా కనిపించడం లేదు. బోర్డు ఏర్పాటు చేయక పోవడంతో ఏ కార్యాలయమో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి మునగాలపాడు సచివాలయానికి వార్డు నంబరు, ఊరి పేరు కనిపించేలా బోర్డు ఏర్పాటు చేసి స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మట్కా బీటర్లు, మద్యం విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రాంతంలో కర్నాటక మద్యం విక్రయించడంతో పాటు, మట్కా రాస్తున్న కోడుమూరుకు చెందిన ఈడిగ వీరమోహన్, గుడిసె పద్మావతి, బోయ అంజనేయులు, వర్కూరు పల్లె రవీంద్రనాథ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపినట్లు కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. వీరి వద్ద నుంచి 52 కర్ణాటక మద్యం ప్యాకెట్లతో పాటు, రూ.50 వేల నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అమడగుంట్లలో ఎస్ఐ పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో బుధవారం రాత్రి కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రజలంతా కలిసికట్టుగా జీవించాలని, చిన్న చిన్న విషయాలకు గొడవల జోలికెళ్లకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు ఇస్తే తగు చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

'సుంకేసుల'లో 1.152 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: 'సుంకేసుల ' డ్యామ్‌లో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బుధవారం అధికారులు తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచిపోయిందని, కేసీకి నీటి విడుదల నిలిపేశామన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సహకారం

- క్రమం తప్పకుండా పగటిపూటే తొమ్మిది గంటలు సరఫరా
- గత ప్రభుత్వంలో విద్యుత్ కోసం రాత్రింబవళ్లు ఎదురుచూపులే
- నాణ్యమైన విద్యుత్ సరఫరాపై రైతుల హర్షం



విద్యుత్ బోరు ద్వారా పొలానికి నీరు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే వ్యవసాయానికి పగటిపూటే తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు ధీమాగా పగటిపూటే పొలం వద్దకు వెళ్లి బోర్లు, మోటార్ల ద్వారా పొలాలకు నీటిని మళ్లించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ కోసం రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఒకానొక సమయంలో వ్యవసాయం దండగ అన్న గత పాలకులు వారి మాటల ప్రకారమే వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. సకాలంలో వర్షాలు రాక, బోర్లకు కరెంట్ ఉండక పగలు 3 గంటలు, రాత్రి 3 గంటలు ఇస్తూ రైతులను తీవ్ర కష్టాలోకి తోశారు. దీంతో గత ప్రభుత్వంలో రాత్రిపూట పొలాల వద్ద పడిగాపులు గాస్తూ విద్యుత్ రాగానే నీటిని పెట్టుకుంటూ పంటలను కాపాడుకునేందుకు జాగారం చేయాల్సి వచ్చేది.

తండ్రి బాటలోనే తనయుడు

2004కు ముందు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర ద్వారా రైతుల కష్టాలను కళ్లారా చూశారు. ఆ తర్వాత సీఎం అయ్యాక వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చే ఫైల్‌పై మొదటి సంతకం చేసి రైతన్నల తలరాతలు మార్చారు. ఆ సంతకంతో మహానేత బతికున్నంత కాలం రైతుల ముఖాల్లో చిరునవ్వు కనిపించేంది. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకాన్ని సక్రమంగా అమలుచేయకుండా పూర్తిగా నిర్వీర్యం చేశాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేశారు. సకాలంలో వర్షాలు రాకపోగా రైతులకు ఇవ్వాల్సిన కరెంట్ పగలు రాత్రి వేళలా ఎప్పుడంటే అప్పుడు ఇస్తూ, ఇష్టానుసారంగా కోతలు విధిస్తూ రైతుల పాలిట శాపంగా మారారు. దీంతో రైతులు ఏడాదికి ఒక పంట సాగుకే నానా ఇబ్బందులు పడేవారు. ఈ సమయంలో ఇడుపుల పాయ నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూసి చలించిపోయారు. ఇక నుంచి రైతన్న అలాంటి కష్టాలు పడకూడదనే ఉద్దేశంతో వ్యవసాయానికి పగటి పూటే తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు శ్రీకారం చుట్టారు. అందుకు తగ్గట్టుగానే రైతన్నలకు విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండడంతో రైతులు నిర్భయంగా మోటార్లు, బోర్ల ద్వారా పొలాలను తడుపుతున్నారు. అలాగే గత మూడేళ్ల నుంచి అనుకున్న సమయంలో వర్షాలు కురుస్తుండడంతో ఏ బోరులోనూ భూగర్భజలాలు అడుగంటలేదు. దీనికి తోడు విద్యుత్ సరఫరాపై భరోసా ఉండడంతో నియోజకవర్గంలో రైతులు 25 వేలకు పైగా ఎకరాల్లో రెండు కార్లు పంటలు పండిస్తున్నారు.

మండలాల వారీగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇలా..

మండలం	వ్యవసాయ బోర్లు	ఆయకట్టు (ఎకరాల్లో)
పాణ్యం	3,353	6,789
గడివేముల	4,570	8,630
కల్లూరు	1,247	-----
హంద్రీనీవా కాల్వలో	1,000	2,700
ఓర్వకల్లు	4,625	7,681
మొత్తం	14,795	25,800

గతంలో ఇబ్బందులు పడేవాళ్లం



గత ప్రభుత్వం హయాంలో పగలు, రాత్రి తేడాలేకుండా ఎప్పుడంటే అప్పుడు వ్యవసాయ విద్యుత్ వచ్చేది, పోయేది. పంటలను కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు బోర్ల వద్ద ఎదురుచూస్తూ కరెంట్ వచ్చాక పొలలకు నీరు పెట్టుకునేవాళ్లం. ఆ ఐదేళ్ల కాలంలో ఏడాదికి ఒక పంట సాగుకే నానా ఇబ్బందులు పడేవాళ్లం. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వ్యవసాయ విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టారు. ప్రస్తుతం పగటిపూటే తొమ్మిది గంటలు నాణ్యమైన కరెంట్ వస్తుంది. ఏ ఇబ్బంది వచ్చినా సకాలంలో స్పందిస్తున్నారు. ప్రస్తుతం ఆరెకరాలు సొంతం, మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, ఆముదం, కంది, వరి పంటలను సాగు చేస్తున్నాను.

– జి.సోమన్నయాదవ్, తడకనపల్లె గ్రామం, కల్లూరు మండలం

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

వ్యవసాయ బోర్లకు త్రీఫేజ్ ద్వారా పగటిపూట తొమ్మిది గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి అనతి కాలంలోనే పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లినా రోజుల వ్యవధిలోనే పరిష్కారిస్తున్నాం.

– పుల్లయ్య, ఏఈ పాణ్యం

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



తులశాపురంలో జగనన్న కాలనీలో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీడీఓ ఆజాంఖాన్

కర్నూలు (న్యూటౌన్): జగనన్న కాలనీల్లో ప్రతి లబ్ధిదారుడు ఇంటిని నిర్మించుకునేలా అవగాహన కల్పించి, గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కర్నూలు ఎంపీడీఓ కేఏ ఆజాంఖాన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం తులశాపురం, దేవమడ గ్రామాల్లో జగనన్న కాలనీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటే ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరవుతున్నాయని వివరించారు. తులశాపురం జగనన్న కాలనీలో మంచి నీరు, విద్యుత్, రోడ్లు సౌకర్యం కల్పించామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇంటి నిర్మాణం ప్రారంభించక పోతే పట్టా రద్దవుతుందనే విషయాన్ని లబ్ధిదారులు గుర్తించాలన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ మనోజ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేపు ఆసుపత్రి భవనం ప్రారంభం

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో నిర్మించిన నూతన ఆసుపత్రి భవనాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు తెలిపారు. ప్రభుత్వం నిర్మించిన నూతన ఆసుపత్రి భవనంతో పాటు, రెండు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

పర్యాటకం అభివృద్ధికి కృషి



టూరిజం మ్యాప్‌ను పరిశీలించి మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు (న్యూటౌన్): ఏపీ టూరిజాన్ని విస్తరించేందుకు కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు మండలం నందనపల్లె శివారులోని గార్గేయపురం చెరువు ఒడ్డున ఉన్న ఏపీ టూరిజం హోటల్ పరిసరాలను కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడుతో కలసి ఆమె పరిశీలించారు. ఏపీ టూరిజం హోటల్‌ను విస్తరించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు రెవెన్యూ మ్యాప్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గార్గేయపురం చెరువు పక్కనే ఏపీ టూరిజాన్ని విస్తరించి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. పర్యాటక రంగం అభివృద్ధి ఆవశ్యకతను వివరించారు. ఇప్పటికే నగరవనం, గార్గేయపురం చెరువులో పర్యాటకులు రోజురోజుకు పెరుగుతున్నారని, పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా ఏపీ టూరిజాన్ని మరింత విస్తరించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది వెంట ఉన్నారు.

'జగనన్న సురక్ష' సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ శ్యామల

సి.బెళగల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిని శ్యామల తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులకు జగనన్న సురక్ష కార్యక్రమ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జూలై 4 నుంచి కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని, అంతకుముందు సచివాలయ ఉద్యోగులు వలంటీర్లను సమన్వయం చేసుకుని ప్రతి ఇంటిని సందర్శించి, ప్రభుత్వం నుంచి అందిన, అందాల్సిన సేవలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమం గ్రామంలో నిర్వహించిన రోజు అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అందజేయడంతో పాటు, వారి సమస్యల పరిష్కారంకు కృషి చేయాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు. వలంటీర్ల ద్వారా ఆయా కుటుంబాలకు అందాల్సిన సేవలను ముందస్తుగా నమోదు చేసుకుని 11 రకాల ధృవపత్రాలను అర్హులైన వారికి ఉచితంగా అందజేయాలని తహసీల్దార్ శేషఫణి ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, డీటీ కృష్ణమూర్తి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, పీఆర్ ఏఈలు సుమంత్, గోసేనాయక్, గంగరాజు, ఏఓ మల్లేష్‌కుమార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన ఉండాలి



విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంఈఓ శరభయ్య, మేనేజర్ మల్లికార్జున

కోడుమూరు రూరల్ : బ్యాంకు లావాదేవీలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కలిగివుండాలని కోడుమూరు ఏపీజీబీ మేనేజర్ మల్లికార్జున సూచించారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8నుంచి10వతరగతి విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై అఖిల భారత స్కూల్ క్విజ్ మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ క్రెడిట్, ఏటీఎం కార్డుల పిన్ నంబర్లను ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు చెప్పరాదన్నారు.

క్విజ్ విజేతలు వీరే : బ్యాంకింగ్ సేవలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో మొదటి స్థానంలో కోడుమూరు బాలురు హైస్కూల్ విద్యార్థులు సాహెబ్‌మాలిక్, దుర్గా ప్రసాద్ నిలువగా, 2వ స్థానంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు సాహెన్, బురానుద్దీన్, 3వ స్థానంలో కేజీబీవీ విద్యార్థినులు లాస్యప్రియ, అస్మత్ బేగం నిలిచారు. వీరికి ఎంఈఓ శరభయ్య చేతుల మీదుగా మేనేజర్ మల్లికార్జున ప్రశంసాపత్రాలను అందజేశారు. అదేవిధంగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేల చొప్పున త్వరలో నగదు బహుమతులను కూడా అందజేస్తున్నట్లు మల్లికార్జున తెలియజేశారు.

క్విజ్ విజేతలకు ప్రోత్సాహక బహుమతులు

ఓర్వకల్లు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలైన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. భారత రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం అఖిల భారత స్కూల్ క్విజ్ పోటీలను నిర్వహించినట్లు కెనరా బ్యాంక్ మేనేజర్ కోదండపాణి తెలిపారు. పోటీల్లో మండలంలోని 7 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా కాల్వబుగ్గ గురుకుల పాఠశాల విద్యార్థులు తొలి బహుమతి రూ.5 వేలు, ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రెండో బహుమతిగా రూ. 4 వేలు, శకునాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మూడో బహుమతి రూ.3 వేలు గెలుచుకున్నారు. హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరు: విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజ కుమారి అన్నారు. బుధవారం కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో భారతీయ రిజర్వ్ బ్యాంక్, ఏపీ ఆర్థిక సమీకృత, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. 18 పాఠశాలలకు చెందిన విద్యార్థులు టీమ్‌లుగా ఏర్పడి పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో విజేతలైన వారికి ఎంఈఓలు శ్రీనివాసులు, వనజ కుమారి, కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రభాకర్ నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

యోగా డే

డివిజన్ వ్యాప్తంగా బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా శిక్షకులు విద్యార్థులు, ఉద్యోగులచే ఆసనాలు వేయించి యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగాతో మానసిక రుగ్మతలు తొలగిపోయి మానసిక ప్రశాంతత కలుగుతుందని వివరించారు. అబ్బురపరిచే యోగా ఆసనాలతో పలువురు ఆకట్టుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాణ్యం గిరిజన ఆశ్రమ పాఠశాలలో యోగా చేస్తున్న ఎంఈఓ, సర్పంచ్, డాక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు



యోగా చేస్తున్న మత్స్యశాఖ డీడీ శ్యామల, అధికారులు



అమృత సరోవర్ వద్ద యోగా చేస్తున్న చిన్నారులు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి



రైతులకు కొర్రలు, వరి విత్తనాల పాకెట్లను పంపిణీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

కోడుమూరు రూరల్ : ఖరీఫ్ సీజన్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం కోడుమూరులోని రైతుభరోసా కేంద్రంలో యాజమాన్య పద్ధతులపై ఏఓ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వర్షాలు మొదలవుతున్నందున పొలాలను సాగుకు అనుకూలంగా దుక్కిదున్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ఒకే రకమైన పంటలను కాకుండా వివిధ రకాల పంటలను సాగు చేసుకోవాలని, ముఖ్యంగా పత్తి సాగుకు వాతావరణం అంతగా అనుకూలించడం లేదని, ఇతర పంటలు సాగు చేసుకోవాలన్నారు. మోతాదుకు మించి పురుగు మందులు, ఎరువు వాడొద్దని, యాజమాన్య పద్ధతులు పాటించి పెట్టుబడులను తగ్గించుకోవాలన్నారు. ఏఓ రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై వరి విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా అందజేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు ఉచిత కొర్రల మినికిట్లు, సబ్సిడీ వరి విత్తనాల పాకెట్లను ఏడీఏ, ఏఓలు పంపిణీ చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

గడివేముల: నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ హేమసుందర్ రెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం గడివేములతో పాటు మంచాలకట్ట గ్రామాలలో విత్తనాల, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులకు మోసం చేసి నకిలీ విత్తనాలు అమ్మే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మండలంలో నకిలీ, కల్తీ, గడువు ముగిసిన విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసేవారిపై తమకు సమాచారం అందిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాలలోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రతి దుకాణం వద్ద స్టాకు బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

కల్లూరు: మండలంలో అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కె.మార్కపురంలో ఏడుగురు రైతులకు కౌలు కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గుర్తింపు కార్డులు పొందడం వల్ల కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పంట నష్టపరిహారం, ఇతర రాయితీలు అందుతాయన్నారు. అనంతరం పర్ల గ్రామంలో భూసార పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కె.మార్కపురం వీఆర్వో చంద్రశేఖర్, ఏఈఓ, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో సౌకర్యాలపై ఆరా



ఏపీ మోడల్ స్కూల్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ సుధాకర్ రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో నంద్యాల ఇన్‌చార్జి డీఈఓ సుధాకర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బుధవారం పాఠశాలను తనిఖీ చేసిన ఆయన సౌకర్యాలపై ఆరా తీశారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం అందించిన జేవీకే కిట్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులు పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులపై మరోమారు సమీక్ష నిర్వహించి ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. ఎంఈఓ కోటయ్య, ప్రిన్సిపాల్ దినేష్‌బాబు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు

కోడుమూరు రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమం విధివిధానాలపై సూచనలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 24నుంచి ఇంటింటికీ వలంటరీలతో పాటు, సచివాలయ సిబ్బంది వెళ్లి స్వచ్ఛంద సందర్శించాలన్నారు. జూలై 1నుంచి మండల స్థాయిలో రెండు బృందాలుగా ఏర్పడి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సేవలు, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషిచేయాలన్నారు. అలాగే జగనన్నకు చెబుదాంలో లేవనెత్తిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వివరించడం జరుగుతుందన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు



ప్యాలకుర్తి జగనన్న కాలనీలో ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జేడీ రంగాలక్ష్మిదేవి

కోడుమూరు రూరల్ : విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మిదేవి హెచ్చరించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీని జేడీ రంగాలక్ష్మిదేవి తమసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుతో కలిసి సందర్శించి ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా జేడీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరై నిర్మాణాలు మొదలు పెట్టుకోని లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.20వేలను అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, బిల్లులను కూడా త్వరగానే మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం జేడీ మండలంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇండ్ల నిర్మాణాలపై కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జేడీ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లీలావతి, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు



రిజిస్ట్రేషన్ అనంతరం డాక్యుమెంట్లను అందుకుంటున్న బీరం శోభాదేవి

పాణ్యం: గ్రామ స్వరాజ్య పాలనలో భాగంగా మరో అద్భుత ఘట్టానికి మొదటి అడుగు పడింది. గ్రామ సచివాలయాల్లోనే భూముల రిజిస్ట్రేషన్ సేవలు అందించాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కలలు సాకారమవుతున్నాయి. అందుకు నిదర్శనమే బుధవారం పాణ్యం మండలం కొత్తూరు గ్రామంలోని సచివాలయంలో మొదటి రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్యుమెంట్లను అర్హులకు అందించారు. ఈ సందర్భంగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జగనన్న భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా గ్రామంలో రీసర్వే పూర్తిచేసినట్లు తెలిపారు. దీంతో గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు చెప్పారు. గ్రామానికి చెందిన బీరం శివరామిరెడ్డి నుంచి బీరం శోభాదేవికి కొత్త ఎల్‌పీఎం నంబర్–292 పూర్వపు సర్వే నంబర్ 87 విస్తీర్ణం 0.50 సెంట్ల భూమికి సంబంధించి రీసర్వే అనంతరం రిజిస్టర్ చేసి పత్రాలు అందించినట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, వీఆర్ఓ వీరేష్ కుమార్, సర్వేయర్ నాగేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై నిర్లక్ష్యం వద్దు



పిన్నాపురంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

పాణ్యం: స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని నంద్యాల డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. ఆయన బుధవారం పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి తాగునీరు అందించే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ల పైకప్పుల ఏర్పాటు, శుభ్రం చేసే తేదీలు పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. కోతులు, పక్షులు అపరిశుభ్రం చేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలో వర్మీ కంపోస్టు తయారీ యూనిట్లు సక్రమంగా పని చేయాలన్నారు. ఎక్కడా అలసత్వం వహించరాదని సూచించారు. ప్రతి పంచాయతీ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. హరిత రాయబారులకు జీతాలు చెల్లించాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట్ల వేస్ట్ ఆయిల్ బాల్స్ వేసి దోమలను నివారించాలన్నారు. గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. ఈఓఆర్డీ భాస్కరరావు, సర్పంచ్ వెంకటకృష్ణయ్య, కార్యదర్శి నాగేంద్రనాయక్ ఉన్నారు.

25న ఫ్యాప్టో సదస్సు

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 25వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఫ్యాప్టో విద్యా సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కో–చైర్మన్ ప్రకాష్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు.